


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
16-12-2024
పేజీలు: 02

# సంక్రాంతికి బీజేపీకి కొత్త అధ్యక్షుడు




రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరన్న దానిపై పార్టీ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు త్వరలోనే తెరపడనుంది. పార్టీ జాతీయ నాయకత్వం.. సంక్రాంతి కల్లా రాష్ట్రానికి అధ్యక్షుడిని నియమించనున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్గత చర్చల్లో రోజుకో సీనియర్ నేత పేరు తెరపైకి వస్తున్నా.. ఎంపీగా ఉన్న బీసీ నేతకు ఎక్కువ అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ సమీకరణాలు మారితే మాత్రం అనూహ్యంగా కొత్త నేతకూ అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. కానీ, తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వం మదిలో ఏముందో రాష్ట్రంలోని కీలక నేతలకు సైతం అంతు చిక్కడంలేదు. అధికార పీఠమే అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అనుసరించే వ్యూహంలో వేసే ఎత్తుగడలు మాత్రం అనూహ్యంగా ఉండబోతున్నాయని బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. ''పార్టీలో కొంతమంది సీనియర్ నేతల మధ్య అంతర్గత విభేదాలున్న మాట వాస్తవం. రాష్ట్ర పార్టీ వ్యవహారాలు నాలుగు స్తంభాలాటగా మారాయన్న విషయం అధినాయకత్వం దృష్టికి కూడా వెళ్లిం ది. మేం అధికారంలోకి రావాలంటే ముందు పార్టీలో సమన్వయం అవసరం. పార్టీ కొత్త అధ్యక్షుడికి ఈ సమర్థత కీలకం. ఇదే అంశాన్ని మా అధినాయకత్వానికి నివేదించాం'' అని కీలక నేత ఒకరు వెల్లడించారు. ఈ నేపథ్యంలో అన్ని సవాళ్లను ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగే నేతకే పట్టం కట్టబోతోందని చెప్పారు. కాగా, పోరాట పటిమ, సమన్వయం చేసుకునే సమర్థతతోపాటు వయసును కూడా ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందని మరో ముఖ్యనేత పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పలువురు సీనియర్ నేతల నుంచి అభిప్రాయాలు తీసుకున్న పార్టీ అధిష్ఠానం.. తాజాగా మరోసారి కొంతమంది ముఖ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకుందని పార్టీవర్గాలు వెల్లడించాయి. బీసీ సీనియర్ నేతలకు కీలక పదవులు కట్టబెడుతున్న జాతీయ నాయకత్వం.. రాష్ట్ర అధ్యక్ష పదవిని ఓసీలకు కట్టబెట్టే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ, బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎంపీ.. బీసీ..అనే సంకేతాలు అధినాయకత్వం నుంచి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే వాస్తవమైతే.. ఈ కోటాలో ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ పేర్లు ప్రధానంగా చర్చకు రానున్నాయి. కాగా, తాను కూడా రేసులో ఉన్నట్లు అర్వింద్ రెండు రోజుల కిందట పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఒకవేళ ఓసీలకు పట్టం గట్టాల్సివస్తే.. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, లేదా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్లు తెరపైకి రావచ్చని తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావుకు సారథ్య బాధ్యతలు కట్టబెట్టే అవకాశాలూ లేకపోలేదని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, అధ్యక్ష నియామకం జాప్యమయ్యే అవకాశ ముందని, సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఆలస్యమవుతుండడమే ఇందుకు కారణమని చెబుతున్నాయి. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం.. పోలింగ్ బూత్ నుంచి మండల, జిల్లా కమిటీల ఎన్నికలు ఈ నెల 25లోగా పూర్తికావాల్సి ఉంది. కానీ, సభ్యత్వ నమోదు ప్రక్రియే ఇంకా కొలిక్కి రాకపోవడంతో బూత్ కమిటీల ఎన్నికల్లో జాప్యం జరుగుతోంది. అవి పూర్తయితేనే మం డల, జిల్లా కమిటీల ఎన్నికలు జరుగుతాయి.. రాష్ట్రవ్యాప్తంగా 50శాతం జిల్లాల కమిటీలు ఏర్పాటయితేనే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక ఉంటుంది. అంటే, వచ్చేనెల రెండోవారంలోగా ఇది పూర్తికావొచ్చునని పార్టీ సీనియర్ నేత ఒకరు వివరించారు.



## త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తా అల్లు అర్జున్

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను తాను కలవలేక పోతున్నానంటూ అల్లు అర్జున్ తాజాగా తెలిపారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. 'దురదృష్టకర సంఘటన తర్వాత వైద్య సంరక్షణలో ఉన్న శ్రీతేజ్ గురించి నేను ఆందోళన చెందుతున్నాను. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం కొనసాగుతున్న న్యాయపరమైన విచారణ కారణంగా.. ఈ సమయంలో శ్రీతేజ్‌ను, అతడి కుటుంబాన్ని కలవలేకపోతున్నాను. త్వరలోనే వారి కుటుంబాన్ని కలిసి మాట్లాడతాను. వైద్యపరంగా, కుటుంబ పరంగా వారిని ఆదుకుంటానని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాను' అని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. కాగా, సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌ను ఈనెల 13న చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం శనివారం ఉదయం బెయిల్‌పై ఆయన్ని విడుదల చేశారు.



## ఇక ఆన్‌లైన్‌లోనే అన్ని సర్టిఫికెట్లు!

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర సర్టిఫికెట్ల కోసం ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకునేలా కొత్త యాప్‌ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంచాయతీ పరిధిలో బర్త్, డెత్, మ్యారేజ్, హౌజ్ పర్మిషన్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, లే ఔట్ పర్మిషన్ వంటి 20 రకాల సేవలను ఆన్‌లైన్‌లోనే అందించేలా 'మై-పంచాయతీ' యాప్‌ను రూపొందిస్తోంది. గ్రామ సమస్యలపై కూడా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సమాచారం.

T-SAT

## ఇకపై టీసాట్‌లో వ్యవసాయ ప్రసారాలు

పోటీ పరీక్షలు, ఉపాధికి సంబంధించిన కంటెంట్‌ను అందించే టీసాట్ ఇకపై వ్యవసాయ ప్రసారాలనూ అందిస్తుందని ఆ సంస్థ సీఈవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. నిపుణ ఛానల్‌లో ప్రతి సోమ, శనివారాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రసారాలుంటాయని తెలిపారు. మంగళవారం సా.4 నుంచి 5 గంటల వరకు హార్టికల్చర్ అంశాలు ప్రసారం చేస్తామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, అనుభవమున్న రైతులు సలహాలు ఇస్తారని పేర్కొన్నారు.



## నష్టాల్లోనే మొదలు

స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో మొదలయ్యాయి. ఫెడ్ మీటింగ్, గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందాయి. నిఫ్టీ 24,699 (-70), సెన్సెక్స్ 81,874 (-252) వద్ద ట్రేడవుతున్నాయి. రియాల్టి, కన్జూమర్ డ్యురబుల్స్ సూచీలు లాభాల్లో ఉన్నాయి. బ్యాంకు, IT, ఆటో, మెటల్ షేర్లపై సెల్లింగ్ ప్రెజర్ నెలకొంది. INDUSIND, SRIRAM FIN, CIPLA, RIL, BAJAJ FIN టాప్ గెయినర్స్. JSW స్టీల్, TITAN, APOLLOHOSP, TCS టాప్ లూజర్స్.

## 4 వికెట్లు కోల్పోయిన టీమ్ ఇండియా

ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్ మరోసారి వర్షం కారణంగా నిలిచిపోయింది. వర్షం మొదలయ్యే సమయానికి టీమ్ ఇండియా 4 వికెట్లు కోల్పోయి 48 పరుగులు చేసింది. పంత్ 9 పరుగులు చేసి కమిన్స్ బౌలింగ్‌లో వెనుదిరిగారు. క్రీజులో రాహుల్(30★), రోహిత్(1) ఉన్నారు. భారత్ ఇంకా 397 పరుగులు వెనుకబడి ఉంది.

# ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్



బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ పల్లెలు అద్భుతంగా తీర్చిదిద్దబడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం పెట్టి ప్రతి నెల గ్రామాలకు 275 కోట్లు, పట్టణాలకు 150 కోట్లు ఇచ్చాం. కానీ కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది కాలంలో పల్లె, పట్టణ ప్రగతి కింద ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు ఇవ్వడం లేదని విమర్శించారు. గ్రామపంచాయతీలను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేయడంతో తెలంగాణ పల్లెలకు పోతే చికన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని అమెరికా తన పౌరులను హెచ్చరించే స్థాయికి పరిస్థితి వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనినిబట్టి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు తెలిసిపోతున్నదని మండిపడ్డారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా సర్పంచులకు పెండింగ్ బిల్లులపై హరీశ్‌రావు ప్రశ్నలేవనెత్తారు. దీనికిగాను మంత్రి సీతక్క సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులు రూ.691 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దీనిపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు, కానీ చిన్న కాంట్రాక్టర్లకు సంవత్సరకాలం నుంచి 691 కోట్లు నిధులు ఇవ్వకుండా సర్పంచులు, ఎంపీటీసీలను ప్రభుత్వం గోస పెడుతున్నదని విమర్శించారు. చివరికి వారు గవర్నర్, మంత్రులను కలిసి మొరపెట్టుకున్నారని అయినా లాభం లేదని చలో అసెంబ్లీకి పిలుపునిస్తే వారిని అరెస్టు చేస్తున్నారని చెప్పారు. 'బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ పల్లెలు అద్భుతంగా కేసీఆర్ నాయకత్వంలో తీర్చిదిద్దబడ్డాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం పెట్టి ప్రతి నెల గ్రామాలకు 275 కోట్లు, పట్టణాలకు 150 కోట్లు ఇచ్చాం. కానీ కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది కాలంలో పల్లె, పట్టణ ప్రగతి కింద ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు ఇవ్వకపోవడంతో ఈ సమస్య వచ్చింది.



## బ్రేకప్ వల్ల డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా

కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ వెలుగువెలిగింది పంజాబీ భామ రాశీఖన్నా. 'థాంక్యూ' సినిమా తర్వాత టాలీవుడ్‌లో కాస్త బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం 'తెలుసు కదా' అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో ఆమె నటించిన 'ది సబర్మతీ రిపోర్ట్' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. గుజరాత్ గోద్రా రైలు దహనం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ప్రమోషన్‌లో తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రాశీఖన్నా. గతంలో తాను ప్రేమలో ఉన్నానని, అనుకోని కారణాల వల్ల బ్రేకప్ అయిందని తన విఫల ప్రేమను తలచుకొని భావోద్వేగానికి గురైంది. రాశీఖన్నా మాట్లాడుతూ 'నేను చాలా సున్నిత మనస్కురాలిని. కొన్నేళ్ల క్రిందట ఓ వ్యక్తిని గాఢంగా ప్రేమించాను. కానీ దురదృష్టవశాత్తు మేమిద్దరం విడిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. కొన్ని నెలల పాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. ఆ తర్వాత ధై ర్యాన్ని కూడగట్టుకొని కెరీర్ మీద దృష్టి పెట్టాను.

## చరిత్ర సృష్టించిన కేన్ మామ



న్యూజిలాండ్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఒకే వేదికపై టెస్టుల్లో వరుసగా ఐదు సెంచరీలు చేసిన ఏకైక బ్యాటర్‌గా నిలిచారు. ఇంగ్లండ్‌తో హామిల్టన్ వేదికగా జరుగుతున్న మ్యాచులో ఈ ఘనత అందుకున్నారు. ఇప్పటివరకు విలియమ్సన్ టెస్టుల్లో 33 సెంచరీలు చేశారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## 'స్పిరిట్'లో కియారా, నయన్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్టార్ లైనప్‌లో భారీ అంచనాలు ఉన్న సినిమా 'స్పిరిట్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా రాబోతుంది. కాగా ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ ఉంటారని, వారిలో ఒక హీరోయిన్ గా కియారా అద్వానీ నటించబోతుందని తెలుస్తోంది. ప్రభాస్ సరసన కియారా అద్వానీ అంటే.. కాంబినేషన్ బాగుంటుంది. ఇక మరో హీరోయిన్ గా నయనతారను తీసుకుంటారట. గతంలో 2007లో ప్రభాస్, నయనతార 'యోగి' మూవీలో జంటగా కనిపించిన సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రాన్ని టి-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. అన్నట్టు 'స్పిరిట్' మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. సందీప్ రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమా రాబోతుందని తెలుస్తోంది. అన్నట్టు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమా కోసం ఇప్పటికే సాంగ్స్ ను కంపోజ్ చేయడం స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. 'స్పిరిట్' చిత్రానికి సంబంధించిన స్పెషల్ సాంగ్ ను కూడా ఆల్ రెడీ కంపోజ్ చేశారట.

## కాంగ్రెస్‌కు దెబ్బ మీద దెబ్బ!

'INDIA'లో ఐక్యతకు బీటలు వారుతున్నాయి. కాంగ్రెస్, రాహుల్‌పై మిత్రపక్షాలు విశ్వాసం కోల్పోతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. మొన్నటి వరకు నాయకత్వం మమతకు విడిచిపెట్టాలని డిమాండ్ చేశాయని, ఇప్పుడు ఈవీఎంలపై ఆ పార్టీ వైఖరిని ఖండిస్తున్నాయని పేర్కొంటున్నారు. ఓటింగ్ యంత్రాలపై ఇకనైనా నసుగుడు ఆపాలని జార్ఖండ్ సీఎం ఒమర్ అబ్దుల్లా అనడాన్ని ఉదహరిస్తున్నాయి. కాంగ్రెస్‌పై మిత్రపక్షాల విమర్శలు చేటు చేస్తాయనడంపై మీ కామెంట్.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి తిరిగి ప్రారంభంకానున్నాయి. ఈరోజు ఉదయం 10 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో సభలో ప్రభుత్వం రెండు కీలక బిల్లులు ప్రవేశపెట్టనుంది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు, తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెడతారు. సభ ప్రారంభం కాగానే మొదట ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతుంది. అనంతరం ఇటీవల మృతిచెందిన మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి జ్యోతి, ఊకే అబ్బయ్య, రామచంద్రారెడ్డికి శాసన సభ సంతాపం తెలుపనుంది. అనంతరం సభలో టూరిజం పాలసీపై లఘు చర్చ జరగనుంది.

నేడు కేబినెట్ సమావేశం

సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమవుతుంది. ఆర్‌ఓఆర్ 2024 బిల్లు, పంచాయితీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు సహా ఐదు ఆర్డినెన్సులకు కేబినెట్ ఆమోదం తెలుపనుంది. మంత్రి వర్గం ఆమోదంతో ఆర్‌ఓఆర్ 2024 బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టినున్నారు. కాగా ఈ రోజు అసెంబ్లీ వాయిదా అనంతరం బీఏసీ సమావేశం జరుగుతుంది. అసెంబ్లీ పని దినాలు, బిజినెస్‌ను బీఏసీ ఖరారు చేయనుంది.కాగా తెలంగాణ శీతాకాల సమావేశాలు ఈనెల 9వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు శాసనసభ, శాసన మండలి ఉభయ సభలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. అనంతరం సభ 16వ తేదీకి (సోమవారం) వాయిదా పడిన విషయం తెలిసిందే. అదే రోజు సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారం రోజుల తర్వాత పునర్ ప్రారంభమవుతున్న సమావేశాలు ఈ నెల 21 వరకు కొనసాగే అవకాశం ఉందని సమాచారం. సభ పని దినాలు, చర్చించాల్సిన అంశాలపై ఇవాళ జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.



## కేసీఆర్ ఆనవాళ్లను చేరిపేయడం నీ తరం కాదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కామెంట్స్ చేశారు. ''ప్చ్.. కష్టం రేవంత్ రెడ్డి.. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడం నీ తరం కాదు..ఆయన నిర్మించిన ఇళ్ళకు సున్నాలు వేసి.. ఇందిరమ్మ ఇళ్లని ప్రజల కళ్లకు గంతలు కట్టలేవు.. గోసపడ్డ ప్రతి గుండెకు తెలుసు.. ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు ఆయన పడ్డ తపన ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు- - - కేసీఆర్ కల.. ఎన్నాళ్లున్నా ఆ నిర్మాణాలకు మీరు కేవలం పెయింటర్లు మాత్రమే. ఎప్పటికీ మీరంతా సున్నాల వేసే సన్నాసి బ్యాచ్ మాత్రమే..'' అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

## రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ ప్రారంభం

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు చర్చ కొనసాగింది. ఇక ఇవాళ రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ మొదలైంది.ఉదయం 11 గంటలకు ఉభయసభలు ప్రారంభమయ్యాయి. ఇక రాజ్యసభ ప్రారంభం కాగానే కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రాజ్యాంగంపై చర్చను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. రేపటి వరకూ ఈ చర్చ కొనసాగనుంది. ఇక 17వ తేదీన అంటే మంగళవారం (రేపు) సాయంత్రం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీనిపై ప్రసంగిస్తారు.

## రేపు లోక్‌సభ ముందుకు వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు..!

దేశంలోజమిలిఎన్నికలనిర్వహణకుసంబంధించి రూపొందించినరెండుకీలకబిల్లులకుకేంద్రకేబినెట్ ఆమోదంతెలిపినవిషయంతెలిసిందే.ఈనేపథ్యంలోఒకే దేశం-ఒకేఎన్నికలక్ష్యంతోదేశమంతాఒకేసారి నిర్వహించేజమిలిఎన్నికలపైలోక్‌సభలోబిల్లులను ప్రవేశపెట్టేందుకుకేంద్రంసిద్ధమైనట్లుతెలిసింది.రేపు లోక్‌సభలోఈబిల్లులనుప్రవేశపెట్టనున్నట్లుప్రభుత్వ వర్గాలుతాజాగావెల్లడించాయి.కేంద్రన్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్‌మేఘ్వాల్129వరాజ్యాంగసవరణబిల్లుకింద జమిలిబిల్లునుప్రవేశపెట్టనున్నట్లుతెలిపాయి.ఆతర్వాత దీనినిచర్చకోసంజాయింట్‌పార్లమెంటరీకమిటీకి పంపనున్నారు.వాస్తవానికిరాజ్యాంగ(129వసవరణ) బిల్లుకేంద్రపాలితప్రాంతచట్టాలు(సవరణబిల్లు)ను సోమవారంసభలోప్రవేశపెట్టనున్నట్లుముందుగా వార్తలువచ్చాయి.అయితేతాజాగారివైజ్‌చేసినలోక్‌సభ బిజినెస్‌జాబితాలోవీటినితొలగించారు.




## కిరాటగా మోహన్ లాల్

ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా మళయాలం స్టార్ నటుడు మోహన్ లాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో లాలెట్టన్ (మోహన్ లాల్) కిరాట అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.


## విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్లకు నివాళులు



నేడు విజయ్ దివస్. దేశ చరిత్రలో మర్చిపోలేని రోజు. 1971 యుద్ధంలో భారత్ పాకిస్థాన్ పై విజయం సాధించింది. సరిగ్గా 53 ఏళ్ల క్రితం పాకిస్థాన్ నడ్డివిరిచి పాక్ నుంచి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించడంలో భారత సైన్యం కీలక పాత్ర పోషించింది. 1971లో తూర్పు పాకిస్థాన్‌లో మొదలైన స్వాతంత్ర్య పోరు భారత్-పాక్ మధ్య యుద్ధానికి దారి తీసింది. భారత సైన్యం పాక్‌ను ఓడించి, బంగ్లాదేశ్ అవతరణకు కారణమైంది. ఆ విజయానికి గుర్తుగా భారత్ ఏటా డిసెంబర్ 16న 'విజయ్ దివస్'ను నిర్వహిస్తుంది.ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా తదితరులు యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ వద్ద రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞపకాలను గుర్తు చేసుకుంటూ నేతలు ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశారు. నేడు విజయ్ దివస్. 1971 యుద్ధంలో అలుపెరగని ధైర్యాన్ని ప్రదర్శించి, భారతదేశానికి విజయాన్ని అందించిన మన వీర జవాన్లకు నివాళులర్పిస్తున్నాను.

## ఇళయరాజాకు ఆలయంలో అవమానం

దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఆలయంలో అవమానం జరిగినట్లు తెలుస్తుంది. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో ఉన్న ఆండాళ్ దేవాలయంలో గర్భగుడికి వెళ్లిన ఇళయరాజాను అక్కడున్న పూజారులు బయటకు పంపించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. డిసెంబర్ 16 నుంచి మార్గశిర మాసం ప్రారంభమవుతుండటంతో తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలోని అండాళ్, రంగమన్నార్‌లన్ దర్శించుకునేందుకు ఇళయరాజా ఆలయానికి చేరుకున్నాడు. ఆలయంలోకి వెళ్లిన అనంతరం ఇళయరాజాతో పాటు చిన్నజీయర్ కూడా అతడి వెంట ఉన్నాడు. అయితే స్వామివారి దర్శనం కోసం గర్భగుడి ముందు ఉన్న అర్థ మండపంలోకి రాజా ప్రవేశించడానికి ప్రయత్నించగా.. అక్కడ ఉన్న పూజారులతో పాటు చిన్న జీయర్



కూడా బయటనే ఉండమని చెప్పారు. దీంతో అర్థ మండపం మెట్ల దగ్గర నిలబడి ఇళయరాజా ఆలయ మర్యాదలను స్వీకరించడంతో పాటు స్వామివారిని దర్శించుకున్నాడు. అయితే గర్భగుడిలోకి ఇళయరాజాను రానివ్వక పోవడం కలకలం రేపింది. ఈ విషయంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## హాట్ లుక్‌లో శివంగి జోషి

టీవీ సీరియల్ యే రిష్తా క్యా కెహ్లాతా హైనీ నైరా అకా శివంగి జోషి ఇటీవల సోషల్ మీడియాలో చాలా అందమైన చిత్రాలను పంచుకున్నారు. ఈ చిత్రాలు వేగంగా వైరల్ అవుతున్నాయి, ఈ చిత్రాలలో నటి శివంగి జోషి తన తాజా చిత్రాలను టీవీ సీరియల్‌లో పంచుకున్నారు. నటి శివంగి జోషి యొక్క ఈ చిత్రాలు ఇంటర్నెట్ ప్రపంచంలోకి వచ్చిన వెంటనే, కలకలం రేపింది. శివంగి జోషి యొక్క ఈ చిత్రాలపై అభిమానులు కూడా భారీగా వ్యాఖ్యానించడం ప్రారంభించారు. యే రిష్తా క్యా కెహ్లాతా హై నైరా యొక్క హాట్ లుక్ అభిమానుల హృదయాల్లో స్థిరపడింది,